క్లుప్తంగా

15 నుంచి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

మార్కాపురం టౌన్: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఈనెల 15 నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్వీ భాస్కర్‌రెడ్డి, రాయవరం వెటర్నరీ డాక్టర్ ఎస్.రసజ్ఞ తెలిపారు. 15న బోడపాడు, రాయవరం గ్రామాల్లో టీకాలు ప్రారంభిస్తామని చెప్పారు. 17న మాలపాటిపల్లి, గోగులదిన్నె, 18న దరిమడుగు, 19న నాయుడుపల్లి, 20న పిచ్చిగుంటపల్లి, మన్నెంవారిపల్లి గ్రామాల్లో టీకాలు వేస్తామని వివరించారు. 4 నెలల వయసు నిండిన ఆవులు, గేదెలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని స్పష్టం చేశారు. పాడి రైతులు తమ పశువులను సమీపంలోని పశు వైద్య కేంద్రాలకు తీసుకెళ్లాలని సూచించారు.

వైద్యశాలకు సామగ్రి వితరణ


డాక్టర్లకు సామగ్రి అందజేస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు అవసరమైన సామగ్రిని కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల పోలీసులు శుక్రవారం అందజేశారు. బేస్తవారిపేట, కంభం పోలీసుల ఆధ్వర్యంలో వీల్‌చైర్, స్ట్రెచర్లు, అర్ధవీడు పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాల మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శిరీషా ప్రియదర్శిని పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కంభం ఎస్సై నరసింహారావు, డాక్టర్లు వంశీకృష్ణ, విజయ్‌చంద్ర, శివనాయక్, శ్రావ్య పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్ వేడుకలు


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు హిందీలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. హిందీ ప్రాముఖ్యతను వివరిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు వైద్య పరీక్షలు


బాలికలకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఎస్వీ బాలయ్య పర్యవేక్షణలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ సూచించారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ లాంటి జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, హెచ్‌ఈఓ నారాయణరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ జె.వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు శ్యామల, కెతూర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎటుచూసినా పచ్చదనమే



పుల్లలచెరువు: మండలంలోని ఐటీవరం, మానేపల్లి గ్రామాల్లో రైతులు వరి పంటను విస్తృతంగా సాగు చేస్తున్నారు. కాలువ నీరు పారుదల ఉండటంతో ఆ ప్రాంతంలో ఎక్కువ భాగం వరి పంటను సాగు చేశారు. ఎటు చూసినా భూమి మొత్తం పచ్చదనం పరచుకుని ఉంది. ఆకాశాన్ని అనుకొని ఉందా అన్నట్లుగా కనిపిస్తోంది.


గిద్దలూరు మండలంలో నల్లగట్ల చెరువు కట్ట దుస్థితి ఇదీ..


మరమ్మతులకు నోచుకోని రాచర్ల మండలం చిన్నచెరువు కట్ట


గిద్దలూరు ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో పూడిక తీయని సగిలేరు కాలువ

ప్రతిపాదనలతో సరి.. చెరువుల అభివృద్ధికి కొర్రీ!

- ఆమోదానికి నోచుకోని ఇరిగేషన్‌శాఖ ప్రతిపాదనలు
- ఒక్క చెరువుకూ నిధులు మంజూరు కాని వైనం
- కట్టలు తెగిన, తూములు ధ్వంసమైన చెరువుల్లోకి చేరిన నీరంతా వృథా
- ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతుల ఆవేదన

గిద్దలూరు రూరల్:

పశ్చిమ ప్రకాశం అసలే కరువు ప్రాంతం. గిద్దలూరు నియోజకవర్గంలో ఉపరితల సాగునీరు అందించే ప్రాజెక్టులు, కాలువలేవీ లేకపోవడంతో వర్షాధారంగానే పంటలు సాగు చేస్తుంటారు. వరుణుడు కరుణించి వర్షాలు కురిసినా చెరువుల్లో నీటిని నిల్వ చేసుకునే పరిస్థితులు లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. చెరువుల మరమ్మతులకు ఇరిగేషన్ శాఖ పంపిన ప్రతిపాదనలను కూటమి ప్రభుత్వం ఆమోదించకుండా పక్కన పెట్టడంతో గడిచిన ఏడాది కాలంగా పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. దెబ్బతిన్న చెరువు కట్టలు, తూములను బాగు చేసేందుకు ఇరిగేషన్ శాఖ వద్ద నిధులు లేకపోవడంతో ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు.

గిద్దలూరు మండలంలో మైనర్ ఇరిగేషన్ చెరువులు 13, పంచాయతీరాజ్ చెరువులు 23, రాచర్ల మండలంలో మైనర్ ఇరిగేషన్ చెరువులు 8, పంచాయతీరాజ్ చెరువులు 21, కొమరోలు మండలంలో మైనర్ ఇరిగేషన్ చెరువులు 9, పంచాయతీరాజ్ చెరువులు 31 మొత్తం మూడు మండలాల్లో మైనర్ ఇరిగేషన్ చెరువులు 30, పంచాయతీరాజ్ చెరువులు 75 ఉన్నాయి. గిద్దలూరు ఇరిగేషన్‌శాఖ పరిధిలోని 105 చెరువులు అభివృద్ధికి నోచుకోకుండా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గిద్దలూరు నల్లమల అటవీప్రాంతంలో నుంచి కొండపేట, నల్లబండబజారు, రాచర్లరోడ్డుల మీదుగా సగిలేరు సప్లయ్ చానల్ గుండా రాచర్ల మండలంలోని 5 చెరువులకు నీరు వెళ్లాల్సి ఉంది. సగిలేరు సప్లయ్ చానల్ అభివృద్ధిని పాలకులు పట్టించుకోకపోవడంతో పంట కాలువ కాస్తా మురుగుమయంగా మారిపోయింది. గిద్దలూరు మండలంలోని నల్లగట్ల చెరువు, రాచర్ల మండలంలోని చిన్నచెరువు కట్టలు తెగినా ఇప్పటి వరకు మరమ్మతులకు నోచుకోలేదు. చెరువుల అభివృద్ధి కోసం అధికారులు పంపిన ప్రతిపాదనలు నేటికీ కార్యదరూపం దాల్చలేదు. మరమ్మతుల్లో జాప్యం కారణంగా ఇప్పటికే సామర్థ్యం కోల్పోయిన చెరువులు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తి స్థాయిలో నిండలేదు. ఫలితంగా ఆయకట్టు భూములకు నీరు అందే పరిస్థితి లేకుండా పోయింది.


చిల్లచెట్లలో తుప్పపట్టిన ప్రభుత్వ వాహనాలు

వేధిస్తున్న సిబ్బంది కొరత

గిద్దలూరు ఇరిగేషన్ శాఖ పరిధిలో కొమరోలు, రాచర్ల, గిద్దలూరు మూడు మండలాలు ఉన్నాయి. మొత్తం నలుగురు ఏఈలు విధులు నిర్వర్తించాల్సి ఉండగా ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. మార్కాపురం, యర్రగొండపాలెం నుంచి ఏఈలను డిప్యుటేషన్ కింద కేటాయించి కాలం నెట్టుకొస్తున్నారు. నలుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనిచేయాల్సి ఉండగా ఉండగా ఇద్దరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న ఇరిగేషన్ కార్యాలయం

శిథిల కార్యాలయంలో బిక్కుబిక్కు

గిద్దలూరులోని ఇరిగేషన్ శాఖ ప్రధాన కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఏఈల గదులు నిరుపయోగంగా మారాయి. కార్యాలయ భవనాల గోడలు, శ్లాబులు వర్షానికి ఉరుస్తుండటంతో ఎక్కడ తలదాచుకోవాలో తెలియక అవస్థలకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా చెరువుల మరమ్మతు పనులకు ఉపయోగించే రోలర్లు, ఇతర వాహనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని చిల్లచెట్లలో ఉండిపోయాయి. ఖండమైన వాహనాలను వేలంలో విక్రయించే అవకాశం ఉన్నా అలాగే వదిలేశారు.

కూటమి ప్రభుత్వంపై ఉపాధ్యాయుల రణభేరి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీరారెడ్డి, యూటీఎఫ్ నాయకులు



కొనకనమిట్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

- ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు నిరసనలు
- రణభేరి జాతా పోస్టర్ ఆవిష్కరణలో యూటీఎఫ్ నేత ఓవీ వీరారెడ్డి

మార్కాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఆర్థిక పరమైన విషయాలపై నిర్లక్ష్యం వహిస్తోందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి జాతా నిర్వహిస్తున్నామని సంఘ రాష్ట్ర నాయకుడు ఓవీ వీరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రణభేరి జాతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం ఉద్యోగులకు అండగా లేకపోవడంతో అందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. 3 డీఏలు పెండింగ్‌లో ఉన్నా ఒక్కటి కూడా ప్రకటించకపోవడం, పీఆర్సీ కమిషన్ రాజీనామా చేసి ఏడాదిన్నర అవుతున్నా పునర్నియమించకపోవడం, మధ్యంతర భృతి సైతం ప్రకటించకుండా ప్రభుత్వం మౌనంగా ఉండటంతో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన మొదలైందన్నారు. సీనియర్ నాయకులు ప్రభాకర్, జిల్లా కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న అరియర్స్ ఇవ్వాలని, పాఠశాలల్లో బోధనేతర పనులకు స్వస్తి పలికి ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బోధనేతర పనులను తగ్గించి పరీక్షల విధానాన్ని మార్చాలన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకూ రణభేరి జాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాపయ్య, చెన్నారెడ్డి, శ్రీనివాస్, జయరామిరెడ్డి, రాజేష్, చంద్రశేఖర్, వెంకటరెడ్డి, కృష్ణమూర్తి, కాశింపీరా, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కొనకనమిట్ల: ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. నిరసన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కె.తిరుమల మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. మెమో 57ను వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు మంజూరు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, అన్ని రకాల యాప్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, టి.యోగిరాములు, టి.ఆదినారాయణ, కె.పద్మజ, బి.శ్రీనివాసులు, ఎం.కోటేశ్వరరావు, ఎంవీ నారాయణ, జి.తిరుపతయ్య, వై.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, కార్మిక సంఘ నాయకులు

బేస్తవారిపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ అబ్రహం డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయ సమీపంలో రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వం వాడుకున్న నగదును తిరిగి బోర్డుకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదీన భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తిరుపతయ్య, జె.బాబు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలి


తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న అలసందలపల్లె ఎస్సీ కాలనీవాసులు

కొమరోలు: శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని మండలంలోని అలసందలపల్లె ఎస్సీ కాలనీ వాసులు శుక్రవారం తహసీల్దార్ భాగ్యలక్ష్మిని కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. గ్రామంలో అందరికీ చిన్నపాటి శ్మశానవాటిక ఉందని, ఎస్సీ కాలనీవాసులకు స్థలం సరిపోకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఎస్సీ పాలెం వాసులకు మరోచోట శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యపై కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందించామని చెప్పారు. అధికారులు తమ గ్రామంలో పర్యటించి శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని కోరారు.

గ్రామసింహాలతో జనం బెంబేలు


అమరావతి-కడప రాష్ట్రీయ రహదారిపై గుంపుగా ఉన్న కుక్కలు


జీహెచ్ఎస్ గ్రౌండ్‌లో అధిక సంఖ్యలో కుక్కలు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలు గ్రామ సింహాలు భయోత్పాతం సృష్టిస్తున్నాయి. ఏ వీధిలో చూసినా వీధి కుక్కల మంద కనిపిస్తోంది. పదుల సంఖ్యలో కుక్కలు గుంపుగా సంచరిస్తుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారిని కుక్కలు వెంటాడుతుండటంతో అదుపుతప్పి కిందపడిన సందర్భాలు ఉన్నాయి. కుక్కల బారి నుంచి తప్పించుకునేందుకు పాదచారులు పరుగులు తీయాల్సి వస్తోంది. పిల్లలు ఆడుకునే గ్రౌండ్‌లో కూడా గుంపులు గుంపులుగా కుక్కలు దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని గ్రామాల్లో కూడా శునకాల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసి కొమరోలు, గోపాలునిపల్లె, వర్ధనపల్లె, సూరవారిపల్లె, భావాపురం, బొడ్డువానిపల్లె గ్రామాల్లో 20 మందికి పైగా చిన్నారులు, వృద్ధులను, మహిళలను గాయపరిచింది. గతంలో కూడా కుక్కలు చిన్నారులను కరవడంతో వైద్యశాలల్లో చికిత్స పొందారు. సమస్య తీవ్రత అధికారులకు తెలిసినప్పటికీ పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధికుక్కల బెడదను తప్పించాలని కోరుతున్నారు.


కొమరోలు పోస్టాఫీసు వీధిలో సంచరిస్తున్న కుక్కలు

లక్కవరంలో వైద్య శిబిరం

తాళ్లూరు: మండలంలో విజృంభిస్తున్న విషజ్వరాలతో ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందుల గురించి, వైద్యాధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును వివరిస్తూ 'మంచం పట్టిన తాళ్లూరు' శీర్షికతో ఈ నెల 11వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. తూర్పు గంగవరం ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని లక్కవరంతో పాటు పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆరోగ్యం విషయంలో సమస్య ఏమైనా ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్స పొందాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పి వంశీ నాయక్ పాల్గొన్నారు.


జ్వరపీడితులకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది